ప్రజాశక్తి
బుధవారం 1 అక్టోబర్ 2025

4న వికలాంగ క్రీడాకారులకు ఈత పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో అక్టోబర్ 4న వికలాంగ క్రీడాకారులకు ఈత పోటీలు నిర్వహించనున్నారని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. దయానంద్ తెలిపారు. విశాఖపట్నం జివిఎంసి ఆక్వా స్పోర్ట్స్ ఈత కొలనులో జరుగనున్న ఈ పోటీల్లో విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళంతో బాటు ఉత్తరాంధ్రలో వున్న ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొనవచ్చని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచినవారు జాతీయ పోటీల ఎంపికల కోసం అదే నెల 12న ఏలూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలు కొరకు 9849377577 నంబర్ ను సంప్రదించాలని కోరారు.

నేడు సిఎం చంద్రబాబు పర్యటన



- దత్తి గ్రామంలో పింఛన్ల పంపిణీ
- లబ్ధిదారులతో ముఖాముఖి
- టిడిపి నాయకులతో సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి, దత్తిరాజేరు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం దత్తిరాజేరు మండలం దత్తి గ్రామంలో పర్యటించనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయన ఉదయం 11 గంటల సమయంలో దత్తి గ్రామంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. నేరుగా ప్రజావేదిక వద్దకు వెళ్లి ప్రసంగిస్తారు. అనంతరం లబ్దిదారుల ఇంటికి వెళ్లి ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీని ప్రారంభిస్తారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటారు. అనంతరం 2.30 గంటలు నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, 4గంటల సమయంలో తిరుగు ప్రయాణం అవుతారు.

సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

దత్తి గ్రామంలో సిఎం చంద్రబాబు నాయుడు బుధవారం పర్యటించనున్న నేపథ్యంలో, అధికారులు నిర్వహిస్తున్న ఏర్పాట్లను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమశాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి, రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం పర్యవేక్షించారు. జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, ఎస్‌పి ఎఆర్ దామోదర్, జెసి ఎస్.సేతు మాధవన్‌తో కలిసి సిఎం పాల్గొనే వేదికలను పరిశీలించారు. అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, బొబ్బిలి ఎంఎల్‌ఎ బేబీ నాయన, డిసిసిబి ఛైర్మన్ కిమిడి నాగార్జున, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకొని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ప్రతీనెలా ఒక జిల్లాలో పర్యటిస్తున్నారని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్‌శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

సమీక్షించిన కలెక్టర్ రాంసుందర్ రెడ్డి

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి సమీక్షించారు. దత్తి గ్రామంలోని అన్ని వేదికలను స్వయంగా పరిశీలించారు. గ్రామ సచివాలయంలో కూర్చొని అధికారులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటనల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, ఎస్‌పి ఏఆర్ దామోదర్, జెసి సేథుమాధవన్, ఇతర ఉన్నతాధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు.

దత్తిలో సిఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు అనిత, సంధ్యారాణి, శ్రీనివాస్

సిఎం పర్యటన ఇలా..

విశాఖపట్నం ఎయిర్ పోర్ట్ నుండి బుధవారం 11.20 గంటలకు హెలికాప్టర్లో బయలు దేరి 11.30 గంటలకు దత్తి గ్రామానికి చేరుకుంటారు. దత్తి లో ఏర్పాటు చేసిన ప్రజా వేదిక వద్దకు 11.50 గంటలకు చేరుకుంటారు. 11.50 నుండి 12.05 వరకు పింఛన్ల పంపిణీ చేస్తారు. 12.10 నుంచి 1.40గంటల వరకు దత్తి గ్రామంలో ప్రజా వేదిక సమావేశంలో పాల్గొని లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడుతారు. 1.40 నుంచి 2.10 వరకు రిజర్వులో ఉంటారు. 2.15గంటల నుంచి 3.45గంటల వరకు పార్టీ నాయకులతో సమావేశమవుతారు. 3.50గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకొని హెలికాప్టర్ ద్వారా సాయంత్రం 5.40 గంటలకు ఉండవల్లిలో తన నివాసానికి చేరుకుంటారు.

సిఎం పర్యటనకు భారీ బందోబస్తు : ఎస్‌పి

సిఎం చంద్రబాబునాయుడు పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్‌పి ఎఆర్ దామోదర్ తెలిపారు. గ్రామంలో బందోబస్తు ఏర్పాట్లను మంత్రులు, అధికారులతో కలసి పరిశీలించారు. సుమారు 600మందిని ముఖ్యమంత్రి బందోస్తు నిమిత్తం వినియోగిస్తున్నామని తెలిపారు. బందోబస్తును విజయవంతం చేసేందుకు ట్రయల్ రన్ నిర్వహించి, పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్‌పి పలు సూచనలు చేసారు. రోప్ పార్టీలు, రూట్ మరియు మూవింగ్ బందోబస్తు, నిర్వహించే సిబ్బంది కాన్వాయ్ మార్గంలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని ఆదేశించారు.

జిల్లాలో 2,75,681 మందికి పింఛన్లు

జిల్లాలో ఎన్‌టిఆర్ భరోసా పథకం కింద అక్టోబరు 1న 2,75,681 మందికి సుమారు 116.95 కోట్ల రూపాయలను పంపిణీ చేయనున్నారు. పింఛన్ల పంపిణీని దత్తి గ్రామ సచివాలయం పరిధిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం ప్రారంభిస్తారు. దీనిలో గజపతినగరం నియోజకవర్గంలో మొత్తం 39,641 మందికి రూ.16.62 కోట్లు కాగా, దత్తిరాజేరు మండలంలో 8,430 మందికి రూ.361.34 లక్షలు పింఛన్ల కింద పంపిణీ చేయనున్నారు. ఈ పింఛన్లలో కేవలం దత్తి గ్రామంలోనే 706మందికి రూ.29.34 లక్షలను పంపిణీ చేస్తారు.

సభ వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు : డిఎంహెచ్‌ఒ

కంటోన్మెంట్ : ముఖ్య మంత్రి పర్య టన నేపథ్యం లో రెండు రోజులు పాటు గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని డిఎం హెచ్‌ఒ జీవన రాణి తెలిపారు మంగళవారం దత్తి గ్రామంలో ముఖ్యమంత్రి సభ వద్ద ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు ప్రజలు ఎటు వంటి అనారోగ్యానికి గురైనా వెంటనే ఈ వైద్య శిబిరాలను సంప్రదించాలని తెలి పారు. కార్యక్రమం లో డాక్టర్ సతీశ్ కుమార్, సిసిలు చంద్ర శేఖర్ రాజు, ఎన్.అనిల్ ప్రేమ కుమార్, తదిత రులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ జీవనరాణి

ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఆర్థిక బకాయిలు చెల్లించాలి

- 7న విజయవాడలో జరిగే ధర్నాకు కదలిరండి
- ఫ్యాప్టో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు చెల్లించడంతో పాటు అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 7న విజయవాడ ధర్నా చౌక్ వద్ద వేలాది మందితో నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని రాష్ట్ర ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ ఎస్.చిరంజీవి పిలుపునిచ్చారు. ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ పాలతేరు శ్రీనివాస్ అధ్యక్షతన యుటిఎఫ్ కార్యాలయంలోను, జెడ్‌పి మినిస్టీరియల్ భవనంలో జిల్లా అధ్యక్షులు ఎం.బలరాం నాయుడు అధ్యక్షతన జరిగిన జిల్లా విస్తత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రూ.30వేల కోట్లు ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. తక్షణమే డిఎ ప్రకటించి, 12వ పిఆర్‌సి కమిషన్ వేసి, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుండి తప్పించాలని, సిపిఎస్ స్థానంలో మెరుగైన పెన్షన్ విధానం, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెన్షనర్లకు కార్పొరేషన్ ఏర్పాటు వంటి హామీలను టిడిపి ఇచ్చిందని తెలిపారు. అధికారంలోకి వచ్చి 16 నెలలు పూర్తయినా ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని తెలిపారు. జిల్లా, మండల పరిషత్ యాజమాన్యాల్లో పనిచేస్తూ చనిపోయిన ఉపాధ్యాయుల కుటుంబ వారసులకు నాలుగేళ్లయినా కారుణ్య నియామకాలు చేపట్టలేదని, ఉద్యోగులకు ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెబుతూనే రాష్ట్రంలోని 12 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన ఏ ఒక్క సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించలేదని అన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు చెల్లించవలసిన దాదాపు 30 వేల కోట్ల ఆర్థిక బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం రోడ్ మ్యాప్ ప్రకటించాలని కోరినప్పటికీ ఇంతవరకు స్పందన లేదన్నారు. ప్రతిఏటా రూ.180 కోట్లు హెల్త్ కార్డుల కోసం చెల్లిస్తున్నప్పటికీ ఏ ఆస్పత్రిలోనూ వైద్య సేవలు అందడం లేదని తెలిపారు. ఏకీకృత సర్వీస్ రూల్స్, జెఎల్ పదోన్నతుల సమస్యపై ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయ సంఘాలతో విద్యా రంగ, ఆర్థిక సమస్యలపై చర్చించి పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, ఎపిటిఎఫ్ 1938 నాయకులు పైడిరాజు, ఎస్‌టియు నాయకులు జోగారావు, ఆప్టా నాయకులు భాస్కర్ రావు,బి టి ఎ నాయకులు రామారావు, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష,కార్యదర్శులు లక్ష్మణరావు, వెంకట నాయుడు హెచ్‌ఎం అసోసియేషన్ నాయకులు రాధాకృష్ణ, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు రెడ్డి మోహన్‌రావు, పలు సంఘాల నాయకులు డి.ఈశ్వరరావు, డి.శ్యామ్, జిల్లా నాయకులు శ్రీనివాస రావు, సూరిబాబు, లక్ష్మణరావు, శ్రీనివాస్ దొర పాల్గొన్నారు.

సుజలస్రవంతి కాలువ అలైన్‌మెంట్ మార్చాలి

ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-గజపతినగరం

రైతులకు నష్టం కలిగించే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి లిఫ్ట్ కాలువ అలైన్ మారుస్తామని ఎన్నికల ప్రచారంలో బొండపల్లి సభలో ఇప్పటి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, గంట్యాడ సభలో మంత్రి లోకేష్ ఇచ్చిన హామీని అమలు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, పోలవరం ఎడమకాలువ పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ చల్లా జగన్ డిమాండ్ చేశారు. మంగళవారం పురిటిపెంట పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. సుజల స్రవంతి లిఫ్ట్ కాలువ ద్వారా విజయనగర జిల్లాలో ప్రతిపాదించిన ఈ కాలువ ప్రభుత్వానికి ఆర్థిక భారం, కాలువ భూ సేకరణలో అనేకమందికి 3పంటలు పండే చిన్న,సన్న కారు రైతులుభూములు కోల్పోతారని తెలిపారు. ఈ కాలువ ఎలైన్ మెంట్ కాంట్రాక్టర్ లకు, పాలకుల కమిషన్లు కు తప్ప రైతులకు భవిషత్ లో లిఫ్టులతో సాగునీరు వల్ల రైతుల పై భారం పడుతుందని అన్నారు. జిల్లాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి ప్రత్యామ్నాయ కాలువ ఎస్. కోట నుండి చిలకల గెడ్డ గుండా తాటిపూడి రిజర్వాయర్ నుండి వెంగళరాయ కాలువలు వరకు పైభాగం గుండా కాలువ నిర్మించాలని, జిల్లాలో మెట్ట భాగం గుండా నీరు వెళ్లడం వల్ల అదనపు ఆయకట్టు, భూగర్భ జలాలు పెరిగి లిఫ్టులు భారం తగ్గి జిల్లా ప్రజలకు, రైతులకు మేలు జరిగేలా ప్రత్యామ్నాయాన్ని పరిశీలించాలని కోరారు. సమావేశంలో కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు టి.పైడిపునాయుడు, రైతుసంఘం నాయకులు దేవర జగన్, దాసరి సింహాద్రి, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు ఆర్.హరికృష్ణవేణి, కోడేల శ్రీను పాల్గొన్నారు.

కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు రెడ్డి శంకర్రావు

ట్రంప్ సుంకాలను వ్యతిరేకించండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భారత దేశంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న 50శాతం సుంకాలు వల్ల భారత దేశం ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బ తింటుందని, కావు, ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు అన్నారు. భారత దేశంపై అమెరికా వేస్తున్న సుంకాలు ప్రజలంతా వ్యతిరేకించాలని కోరుతూ మంగళవారం నుండి సిపిఎం ప్రచార కార్యక్రమం చేపట్టింది. అందులో భాగంగానే అయ్యన్న పేట ప్రాంతం లో ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాఉడతూ తక్షణమే రైతులకు వడ్డీలేని రుణం ఇప్పించాలని, పెట్టుబడి దారులపై అదనపు టాక్స్ విధించాలని, దేశంలో ఉత్పత్తి పెంచే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ట్రంప్ చర్యలపై భవిష్యత్ లో దేశ వ్యాప్తంగా పోరాడతామని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి. రమణమ్మ, నగర కమిటీ సభ్యులు బి. రమణ. రంభ శ్రీనివాసు పాల్గొన్నారు

బిఎస్‌ఎన్‌ఎల్ బంపర్ ఆఫర్లు

జనరల్ మేనేజర్ మర్రినాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బిఎస్‌ఎన్‌ఎల్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా బంపర్ ఆఫర్లు ప్రకటించినట్లు జనరల్ మేనేజర్ మర్రినాయుడు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 25ఏళ్లగా విజయనగరం ఆపరేషన్ ఏరియా దాదాపు 300 మొబైల్ టవర్లు విజయవంతంగా ప్రారంభించుకుందన్నారు. 2.45 లక్షల మొబైల్ వినియోగదారులకు సేవలు అందిస్తుందన్నారు. సిల్వర్ జూబ్లీ సందర్భంగా బిఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారుల కోసం ఒకే ప్లాన్ ద్వారా హై స్పీడ్ ఇంటర్నెట్, టీవీ ఛానల్, ఒటిటిలు, వాయిస్ టెలిఫోన్ సేవలను అతి తక్కువ అందుబాటు ధరల్లో అందించడానికి కొత్తగా ట్రిపుల్ ప్లే సర్వీసులను ప్రారంభించిందని తెలిపారు. ఈ ట్రిపుల్ ప్లే సర్వీసుల ద్వారా వినియోగదారులు నెలకు కేవలం 400 రూపాయలు చెల్లించి హై స్పీడ్ ఇంటర్నెట్ 4వందలకు పైగా టివి ఛానళ్లతో పాటు 9 ఒటిటి అప్లికేషన్లు, భారతదేశమంతటికి అపరిమితమైన వాయిస్ కాల్స్ చేసుకునే సౌకర్యాలను ఆస్వాదించవచ్చని తెలిపారు. ఈ ప్లాన్ ను నమోదు చేసుకోవడానికి 1800 4444 కు వాట్సాప్ ద్వారా హాయ్ అని మెసేజ్ పంపడం ద్వారా లేదా సమీపంలోని బిఎస్‌ఎన్‌ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్లను సంప్రదించాలన్నారు. అదనంగా, ఇప్పటికే ఉన్న బీఎస్‌ఎన్‌ఎల్ ఎఫ్‌టిటిహెచ్ కస్టమర్లు కేవలం 140 రూపాయలతో రీఛార్జ్ చేసుకోవడం ద్వారా టివి సేవలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో బిఎస్‌ఎన్‌ఎల్ డిజిఎం డి.దాలినాయుడు, ఎజిఎం డి.శ్రీనివాసరావు, ఎజిఎం ఎస్.లక్ష్మణరావు, ఎజిఎం ఆర్. మురళీధర్ , ఎజిఎం సిహెచ్ శారద , ఎజిఎం ప్రమోద్ కుమార్ దాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

సరస్‌ను సందర్శించిన స్త్రీ నిధి ఎమ్‌డి

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి అమ్మవారు పండగ నేపథ్యంలో డిఆర్‌డిఎ, సెర్ప్ ఆధ్వర్యాన మాన్సాస్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శన (సరస్)ను మంగళవారం స్త్రీ నిధి మేనేజింగ్ డైరెక్టర్ హరిప్రసాద్ ..డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్ పాణితో కలసి పరిశీలించారు. ఈ సరస్ నిర్వహణకు జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ న్యూఢిల్లీ వారు రూ.35లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఒక్కో ఏడాది ఒక్కో రాష్ట్రంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ వేదికలో వందల రకాల మొక్కలు, ప్లాస్టిక్, మట్టి పాత్రలు, పింగాణీ, పూల కుండీలు, వివిధ రకాల బొమ్మలు, వెదురు ఉత్పత్తులు, ఆయుర్వేదిక్ కషాయలు, సేంద్రియ ఉత్పత్తులు, ఒక్కటేమిటి వందల రకాల వస్తువులన్నీ ఒకే చోట దొరుకుతాయని తెలిపారు. ఈ సందర్భంగా స్టాల్స్ నిర్వహకులతో డిజిటల్ మార్కెటింగ్ ను బ్రాండింగ్, ప్యాకింగ్, ప్రాసెసింగ్, సాంకేతిక పరిజ్ఞానం మద్దతు ధర మొదలగు విషయాలపై మాట్లాడారు. డిఆర్‌డిఎ ఎపిడి కె.సావిత్రి , సరస్ స్టేట్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, డిపిఎంలు రాజ్ కుమార్, చిరంజీవి, సీతారామయ్య, లక్ష్మనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవింగ్ చేస్తున్న మైనర్లకు హోంమంత్రి క్లాస్

ప్రజాశక్తి-డెంకాడ

చింతలవలసలోని 5వ బెటాలియన్ సమీపంలో ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న మైనర్లను హోంమంత్రి వంగలపూడి అనిత గమనించారు. తన కాన్వాయ్‌ను అక్కడే ఆపించి, మైనర్లను సుతిమెత్తగా మందలించారు. వాహనాలను చట్ట విరుద్ధంగా మైనర్లకు ఇవ్వడం నేరమని గుర్తు చేసిన హోంమంత్రి, ఈ ఘటనను తల్లిదండ్రులకు తెలియజేయాలంటూ పోలీసులు ఆదేశించారు. ఈ సందర్భంలో హోంమంత్రి అనిత మాట్లాడుతూ వాహనాలను నడిపే వయస్సు రాకముందే పిల్లలకు స్కూటీలు, బైకులు ఇవ్వడం వల్ల వారు తమ ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకుంటున్నారన్నారు. ఇది కేవలం వ్యక్తిగత సమస్య కాదని, సమాజంలోని రహదారి భద్రతకు ముప్పుగా మారుతుందని వ్యాఖ్యానించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇచ్చే విషయంలో చట్ట నిబంధనలు, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ఆమె సూచించారు.

బాలురతో మాట్లాడుతున్న హోంశాఖా మంత్రి అనిత

మంచి బోధన అందించాలి : ఎమ్మెల్యే అదితి

ప్రజాశక్తి, విజయనగరం కోట

డిఎస్‌సిలో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన వారంతా విద్యార్థులకు మంచి బోధన అందించాలని ఎమ్మెల్యే పి. అదితి విజయలక్ష్మి గజపతిరాజు సూచించారు. విజయనగరం నియోజకవర్గం డిఎస్‌సి విజేతలను ఆమె మంగళవారం అశోక్‌బంగ్లాలో అభినందించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన సభలో నియామక పత్రాలు అందుకున్న ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చి 16వేల పోస్టులను భర్తీ చేశామని గుర్తు చేశారు. ఉపాధ్యాయులంతా విద్యార్థులకు మంచి బోధన అందించి వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దాలని కోరారు.

ఫ్రీహోల్డులో ఉన్న భూములు ఇవే...

ఫ్రీ హోల్డ్ పేరిట భూ దందా

- పేదల భూములు పెద్దల చేతుల్లోకి..
- రెవెన్యూ అధికారులే సూత్రధారులు
- అక్రమార్కులపై చర్యలకు మీనమేషాలు

గత వైసిపి ప్రభుత్వం తన అనుచరులకు ప్రభుత్వ భూములు కట్టబెట్టేందుకు ఫ్రీ హోల్డ్ భూములను జిరాయితీలుగా మార్చుతూ చేపట్టిన పట్టాల పంపిణీలో భారీ అవకతవకలు జరిగాయి. దీనిపై కూటమి ప్రభుత్వం విచారణ చేపట్టినప్పటికీ ఎటువంటి చర్యలూ తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో పట్టాలు పొందిన వారు తమ భూములను ఇప్పటికే అమ్మకాలు చేపట్టారు. ఫ్రీ హోల్డ్ పేరుతో ఇలా అమ్మకాలు జరుగుతుంటే రానున్న రోజుల్లో ప్రభుత్వం పేదలకు భూములను ఇవ్వాలన్న ఆలోచనను దూరం పెడుతుందని పలువురు పేర్కొంటున్నారు. వేపాడ మండలంలో అత్యధికంగా ప్రభుత్వ భూములు, పోరంబోకు భూములు బడా నాయకుల చేతుల్లోకి వెళ్లాయన్న ఆరోపణలు ఉన్నాయి. వీటిపై విచారణ పూర్తి చేసిన ఈ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందా లేదా అని ప్రస్తుతం చర్చజరుగుతోంది.

ప్రజాశక్తి- వేపాడ

గత వైసిపి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్రీ హోల్డ్ భూముల పట్టాలు పంపిణీ వ్యవహారంలో భారీగా అవకతవకలు జరిగాయి. వీలుపర్తి, వేపాడ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్1లో 222 ఎకరాల డి-పట్టా భూములను జిరాయితీ భూములుగా మార్పు చేసి రిజిస్ట్రేషన్ చేశారు. కేజీ పూడిలోని భూములు పెద్దల చేతుల్లో కెళ్లాయని ఆరోపణలు రాగా పత్రికల్లో కథనాలు కూడా వెలువడ్డాయి. ఈ విషయమై రాష్ట్ర ప్రత్యేక రెవెన్యూ అధికారి సిసోడియా పరిశీలన చేసి అప్పటి ఎస్‌కోట సబ్ రిజిస్టర్‌గా పనిచేస్తున్న శ్యామలను సస్పెండ్ చేశారు. ఆమెను తిరిగి విధుల్లోకి తీసుకోవడంతో ఫ్రీ హోల్డ్ భూముల వివరాలు సేకరణకే పరిమితమా అక్రమార్కులపై చర్యలు ఉండవా?అంటూ నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు.

నియోజకవర్గానికి మొదటిసారి టిడిపి ఎమ్మెల్యేగా ఎన్నికైన కోళ్ల లలిత కుమారి అప్పట్లో సమగ్ర గిరిజన అభివృద్ధి పథకం (సిఎల్‌డిపి) కింద కెజిపూడి వద్ద గల సుమారు 99 ఎకరాల భూముల్లో గిరిజనులు, దళితులు, బీసీలు జీవనోపాధి పొందేందుకు మూడు విడతలుగా కోట్ల రూపాయలు నిధులు వెచ్చించి సాగులోకి తెచ్చారు. ఆ భూములను చదును చేయటం, చెక్ డాములు నిర్మించడం, మొక్కలు నాటడం, భూములకు ట్రంచ్ కటింగ్ ఏర్పాటు చేసి ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో పండ్ల, పూల మొక్కల పెంపకంతో పాటు బోర్లు, విద్యుత్ సౌకర్యం కల్పించి ఫారం పాండ్స్ వంటి కార్యక్రమాలు కూడా ప్రభుత్వ నిధులతోనే చేపట్టారు. తర్వాత కొంతకాలానికి అదే భూమిని ఓపెన్ సబ్ జైలు కోసం కేటాయిస్తున్నామని ప్రభుత్వం ప్రకటించడంతో పరిశీలించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో తహశీల్దార్ కృష్ణంరాజు, డిటి సన్యాసినాయుడు, ఆర్‌ఐ రామలక్ష్మి ఈ భూములను ఫ్రీ హోల్డ్ పేరుతో బడా నేతలకు దోచి పెట్టారు. ఈ విషయం ప్రజాశక్తిలో వెలువడగా వెంటనే సిసోడియా విచారణ చేపట్టారు. కానీ నేటికీ ఎటువంటి చర్యలూ లేవు.

దర్యాప్తు చేస్తున్నాం

ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించి పట్టాల పంపిణీలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నాం. భూముల పంపిణీ నా హయాంలో జరగలేదు. అయినప్పటికీ ప్రభుత్వ ఆదేశాల మేరకు దర్యాప్తు చేస్తున్నాం. భూముల విషయంలో అక్రమాలు జరిగినట్లు రుజువైతే బాధితులపై చర్యలు తీసుకొని భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూములను అమ్మడం, కొనటం నేరం.

జె. రాములమ్మ, తహశీల్దార్, వేపాడ.

విచారణ వివరాలు బయటపెట్టాలి



మండలంలోని ఫ్రీ హోల్డ్ పేరుతో భూములను బడా నేతలకు కట్టబెట్టడాన్ని ఆర్‌డిఒ కార్యాలయం నుంచి సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు సేకరించి వెలుగులోకి తీసుకొచ్చినప్పటికీ భూములపై రెవెన్యూ అధికారులు వివరాలను గోప్యంగా ఎందుకు ఉంచుతున్నారో ప్రజలకు తెలియజేయాలి. పేదలకు వ్యవసాయం చేసుకొని బతికేందుకు ప్రభుత్వం ఇచ్చిన భూములు పెద్దల చేతుల్లోకి వెళ్లినప్పటికీ జిరాయితీగా మార్పు చేసి పట్టాలను ఏ విధంగా అందజేశారో చెప్పాలి. ఫ్రీ హోల్డ్ భూముల విషయాలను బయట పెట్టకుంటే దీనిపై జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

తమ్మినేని సూర్యనారాయణ. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి

నిరాహార దీక్షలో పాల్గొని నినాదాలు చేస్తున్న నిర్వాసితులు, నాయకులు

భూములను అమ్మేందుకు కుట్ర

ప్రజాశక్తి – శృంగవరపుకోట

18 ఏళ్లుగా ఎటువంటి పరిశ్రమా పెట్టని జిందాల్ కంపెనీ మరలా అదే భూమిలో వేరే పరిశ్రమలు పెడతామని చెపితే ప్రజలు ఎలా నమ్ముతారని, కేవలం ఆ భూములను అమ్మేందుకు చేస్తున్న కుట్రలో భాగంగానే ఈ మాటలు చెబుతున్నారని సిపిఎం నాయకులు చల్లా జగన్ అన్నారు. మండలంలోని బొడ్డవర వద్ద రిలే నిరాహార దీక్ష చేస్తున్న నిర్వాసితులతో ఆయన మంగళవారం మాట్లాడుతూ పరిశ్రమ గాని జిందాల్ యాజమాన్యం గాని నిర్వాసితుల న్యాయమైన డిమాండ్లను పరిష్కారం చేయకుండా పోలీసులతో నిర్బంధం ప్రయోగించి ఉద్యమాన్ని నీరు కార్చే కుట్ర చేస్తోందన్నారు. నిర్బంధం ఎంత ఎక్కువైతే తిరుగుబాటు కూడా అంతే ఎక్కువవుతుందని జిందాల్ యాజమాన్యం మోసగించి తీసుకున్న భూమి తిరిగి నిర్వాసితులకు ఇచ్చేవరకు నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు.

ఆంధ్రలో మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి– మెంటాడ

మండలంలోని ఆంధ్రలో మంగళవారం దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మాతృభూమి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆంధ్ర భవానీ యూత్ సంయుక్త సహకారంతో మెగా రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయనగరం ఎన్టియన్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 30 మంది రక్తదానం చేశారు. అన్నదాన మహోత్సవంలో చుట్టుపక్కల దాదాపు 15 గిరిజన గ్రామాల నుండి వచ్చిన సుమారు రెండు వేల మంది ప్రజలు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి బి.గోపాలరావు, ఆంధ్ర భవానీ యూత్ సభ్యులు, భక్తులు ప్రత్యేకంగా అభినందించారు.

పలు దుకాణాలపై దాడులు

ప్రజాశక్తి– శృంగవరపుకోట

మండలంలోని తూనికలు కొలతల అధికారులు మంగళవారం పలు దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా తూనికలు కొలతల శాఖ ఇన్స్పెక్టర్ ఉమా సుందర మాట్లాడుతూ పట్టణంలోని పలు వంట దుకాణాలు, కాయగూరల దుకాణాలు, రైతు బజార్లో దాడులు నిర్వహించామన్నారు. పండ్ల దుకాణం బండిలో కేజీకు 800 గ్రాములు వస్తున్నట్లు గుర్తించామని, షీల్డ్ లేకపోవడం, తూకం రాళ్లు సరిగా లేకపోవడం గమనించామని చెప్పారు. తోపుడు బల్లపై పండ్లను విక్రయిస్తున్న ఐదు దుకాణదారులపై కేసులు నమోదు చేసి కాటాలను సీజ్ చేశామన్నారు.

పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి

30 వైసిపి కుటుంబాలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి– విజయనగరం కోట

విజయనగరం మండలం దుప్పాడ గ్రామానికి చెందిన వైసిపి నాయకులు కరుముజ్జి వెంకటరమణ , బోర గణేష్ , పాంధ్రంకి అప్పలనాయుడు , నడుపూరు త్రినాధ్ తోపాటు 30 కుటుంబాల వారు మంగళవారం ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలూ శ్రమించడాన్ని చూసి వైసిపి నాయకులు టిడిపిలో చేరుతున్నారని అన్నారు. తమ నుంచి కక్ష పూరిత రాజకియాలు ఉండవన్నారు. పార్టీ కోసం కష్టపడి న వారికి అవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పొలినాయుడు, జొన్న వలస, రాకోడు ఎంపిటిలు రాజేష్ బాబు, వేచలపు శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

థెరిస్సా క్లబ్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి–కంటోన్మెంట్

పేదలకు, విద్యార్థులకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని సహాయ పౌరసంబంధాల అధికారి చిప్పాడ ప్రభుదాస్ థెరిస్సా క్లబ్ ప్రతినిధులను అభినందించారు. మంగళవారం జిల్లా కేంద్రాస్పత్రి వద్ద రోగుల సందర్శకులకు థెరిస్సా క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదానం భోజనం పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. థెరిస్సా క్లబ్ వ్యవస్థాపకుడు కె.టి.కురియాకోస్ ఆధ్వర్యంలో పేదలకు, విద్యార్థులకు, మహిళకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. 53వ పుట్టిన రోజు సందర్భంగా పౌరసంబంధాల అధికారి చిప్పాడ ప్రభుదాస్ అన్నదానం కార్యక్రమంలో రోగుల సందర్శకులకు అందజేసారు. కురియాకోస్ థెరిస్సా క్లబ్ అందిస్తున్న సేవలను నిరంతరం కొనసాగించేందుకు ప్రజాప్రతినిధులు, ప్రజలు తమ సహకారం అందించాలని కోరారు.

హమ్మయ్య పిచ్చి మొక్కలు తొలగించారు..

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి– రేగిడి

పిచ్చి మొక్కలు తొలగించిన తరువాత వంతెన

మండలంలోని సంకిలి నాగావళి నది వంతెనపై ఆర్అండ్బి అధికారులు పిచ్చి మొక్కలు, రంధ్రాలలో కూరికిపోయిన మట్టిని తొలగించారు. ఇటీవల ప్రజాశక్తిలో వంతెన శిథిలం.. పిచ్చి మొక్కలతో పేరుకుపోయిన వంతెన.. రంధ్రాల్లో నిండుకున్న మట్టి అనే కథనం ప్రచురించడంతో ఆర్అండ్బి అధికారులు స్పందించారు. తక్షణమే వంతెనపై పిచ్చి మొక్కలను తొలగించారు. వర్షపు నీరు నిల్వ లేకుండా రంధ్రాలలో కూరుకుపోయిన మట్టిని తొలగించారు.

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్

ప్రజాశక్తి – చీపురుపల్లి

పార్టీ కార్యకర్తలకు, సోషల్ మీడియా కార్యకర్తలకు డిజిటల్ బుక్ అండగా ఉంటుందని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం చీపురుపల్లిలో ఉన్న వైసిపి కార్యాలయంలో మాజీ ఎమ్పి బెల్లాన చంద్రశేఖర్తో కలసి ఆయన వైసిపి డిజిటల్ బుక్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి నాయకులను, కార్యకర్తలను, సోషల్ మీడియా కార్యకర్తలపైన కూటమి ప్రభుత్వం దాడులు, దౌర్జన్యాలు చేస్తున్న నేపథ్యంలో పార్టీ వారికి అండగా నిలవాలనే ఉద్దేశ్యంతోనే ఈ డిజిటల్ బుక్ని ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో నియోజకవర్గాలు, మండలాల వారీగా డిజిటల్ బుక్ ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని కోరారు. కూటమి ప్రభుత్వం మోసపూరిత పాలనను ఎండగట్టే విధంగా సోషల్ మీడియా పని చేయాలని సూచించారు. తాము అధికారంలోనికి వచ్చిన వెంటనే తప్పు

జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

డిజిటల్ బుక్ను ఆవిష్కరిస్తున్న జెడ్పి ఛైర్మన్, మాజీ ఎమ్పి

చేసిన ప్రతి ఒక్కరినీ చట్టం ముందు నిలబెట్టి వారు చేసిన దుర్మార్గాలను రుజువుచేసి శిక్ష పడేలా చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన వైసిపి నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, తాడ్డి వేణుగోపాలనాయుడు, కెవి సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు, వాకాడ శ్రీనివాసరావు, మీసాల విశ్వేశ్వరరావు, బెల్లాన బంగారినాయుడు, కోట్ల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

జామి రూరల్ : కూటమి ప్రభుత్వం ఆరాచక పాలనలో కార్యకర్తలకు అన్యాయం జరిగినా, అధికారులు వేదింపులకు పాల్పడిన అటువంటి సంఘటనలను డిజిటల్ బుక్కి ఎక్కించి, పార్టీ అధికారంలోకి వచ్చాక వాటిపై సరియైన న్యాయం జరిగేలా కృషి చేస్తామని వైసిపి మండల కన్వీనర్ గొర్లె రవికుమార్ తెలిపారు. జామిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డిజిటల్ యాప్ పోస్టర్ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి జి.సరయు, ఎంపిపి ఎస్.అరుణ, సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పల్లె నిద్రలో యువతతో మాట్లాడుతున్న ఎస్ఐ

ఎస్ఐ పల్లెనిద్ర

నెల్లిమర్ల: తమ్మాపురం పంచాయతీ పరిధిలోని ఆల్తిపాలెంలో ఎస్ఐ బి.గణేష్ సోమవారం రాత్రి పల్లె నిద్ర నిర్వహించారు. గ్రామస్తులతో మమేకమై గ్రామంలో గల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చక్కగా చదివించాలని, సరైన మార్గంలో వెళు తున్నారా లేదా అని ఆరా తీయాలని సూచించారు. పిల్లలు కూడా తమ తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి భవిష్యత్తులో తల్లిదండ్రులు గర్వపడేలా ఉన్నత స్థానానికి వెళ్లాలని కోరారు. సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్ తదితర మాదక ద్రవ్యాలు, వాటి పరిణామాల గురించి, మహిళలపై జరిగే లైంగిక దాడులు గురించి అవగాహన కల్పించారు.

సబ్ జైళ్ల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి– బొబ్బిలి, విజయనగరం కోట

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. బబిత మంగళవారం బొబ్బిలి, విజయనగరం సబ్ జైల్లను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. కారాగారంలో ఉన్న ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించి పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఖైదీల పట్ల సిబ్బంది గాని తోటి ఖైదీలు గాని ఎటువంటి వివక్షత చూపించరాదని సుప్రీంకోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ నేర ప్రవృత్తిని విడనాడాలని మారు మనస్సు పొంది మంచి పౌరులుగా మెలగాలని హితవు పలికారు. సకాలంలో న్యాయ సహాయం అందించడానికి జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్లను ఏర్పాటు చేశామని వాటిని సక్రమంగా కొనసాగించాలని తెలిపారు. జైల్లో ఉన్న ముద్దాయిలకు ఉచిత న్యాయ సహాయము అందించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ముఖ్య కర్తవ్యం అని తెలిపారు. జైలులో అమలవుతున్న సౌకర్యాలు గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. వంటగదిని భోజన శాలను పరిశీలించారు. స్టోర్ రూమ్ సందర్శించి వంట సరుకులను పప్పు దినుసులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఏ.కృష్ణ ప్రసాద్, సబ్ జైలు సూపరింటెండెంట్, పానెల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఖైదీలతో మాట్లాడుతున జిల్లా జడ్జి బబిత

అన్నదానంలో వివక్ష

◆ దళితులకు వేరు టెంటు వేసిన అగ్రకులాలు
◆ భోజనాలను బహిష్కరించిన ఎస్సిలు

ప్రజాశక్తి– సంతకవిటి

విజయదశమి నవరాత్రుల సందర్భంగా తాలాడ గ్రామంలో మంగళవారం జరిగిన అన్నదాన కార్యక్రమంలో దళితులకు వేరుగా భోజనం ఏర్పాటు చేసిన ఘటన వారిని ఆవేదనకు గురిచేసింది. గ్రామంలోని అగ్రకులాలు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలోని దళితులపై వివక్ష చూపించారు. ఎక్కడైనా అన్నదానం ఒకే చోటు నిర్వహిస్తారు కానీ తాలాడలోని మాత్రం రెండు టెంట్లు ఏర్పాటు చేసి దళితులకు వేరుగా అన్నదానం చేశారు. ఆ గ్రామంలో పూర్వం నుంచి ఇదే ఆచారం జరుగుతుండటంతో దళిత జెఎసి నాయకులు, ఇది భారత రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కుకు విరుద్ధమని మండిపడుతున్నారు. గ్రామంలోని అన్నదాన కార్యక్రమంలో దళితులను మిగిలిన ప్రజల నుండి వేరుగా భోజనం చేయించడాన్ని, గ్రామస్థులు కొందరు సాంప్రదాయంగా సమర్థించాలనుకున్నారు. అయితే ఇది ఖచ్చితంగా కులవివక్ష అని స్థానిక దళితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అగ్రకులాల వారి కోసం ఏర్పాటు చేసిన టెంటు వైపు దళితులను కనీసం రానివ్వరు. దేవి నవరాత్రులకు అగ్రకులాలు వసూళ్లు చేసిన చందాలను దళితులు కూడా ఇచ్చారు. అయినా డబ్బుకు లేని వివక్ష భోజనానికి వచ్చిందని దళిత యువకులు మండిపడుతున్నారు. డిజిటల్ ఇండియా అని ప్రభుత్వం గొప్పగా చెప్పుకున్నా వాటికి భిన్నంగా గ్రామాల్లో ఇంకా కులవివక్ష ఉందని దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దళితుల కోసం వేరుగా ఏర్పాటు చేసిన టెంటు

అగ్రకులాలు వారు వేరువేరు టెంట్లు వేసి అవమానించడంతో కొంతమంది దళిత యువకులు అన్నదానాన్ని బహిష్కరించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి అగ్రకులాలపై చర్యలు తీసుకోవాలి స్థానిక దళితులు డిమాండ్ చేస్తున్నారు.



మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై వైసిపి నిరసన

ప్రజాశక్తి–కంటోన్మెంట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైసిపి ఆధ్వర్యాన మంగళవారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం వద్ద వైసిపి నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, వైసిపి ఎస్సి సెల్ అధ్యక్షులు పి.జైహింద్కుమార్ మాట్లాడారు. వైసిపి హయాంలో ప్రభుత్వ కళాశాలలో నిర్మిస్తే వాటిని నేటి టిడిపి కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేయడం దుర్మార్గమని అన్నారు. దీనివల్ల పేద విద్యార్థులకు వైద్య విద్య అందే పరిస్థితి ఉండదని అన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకునే వరకు ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి కెవి సూర్యనారాయణరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వర్రి నర్సింమూర్తి, ఎస్సీ సెల్ టౌన్ అధ్యక్షులు బుంగ భానుమూర్తి, జిల్లా యువజన విభాగ అధ్యక్షులు అవినాష్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుహాసినిని సత్కరిస్తున్న టిడిపి నాయకులు

డైరెక్టర్గా సుహాసిని ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి– డెంకాడ

రాష్ట్ర ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్గా చీకటి సుహాసిని సోమవారం విజయవాడలో ప్రమాణ స్వీకారం చేశారు. మండలంలోని చింతలవలస ఎపిఎస్పి బెటాలియన్కు చెందిన సుహాసిని ప్రస్తుతం ఆ గ్రామ ఉప సర్పంచ్గా పనిచేస్తూ టిడిపిలో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి పతివాడ అప్పలనారాయణ, భోగాపురం టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, డెంకాడ పిఎసిఎస్ మాజీ చైర్మన్ ప్రదీప్ రాజు, విజయనగరం పార్లమెంటు టిడిపి ఉపాధ్యక్షులు చిల్ల పద్మ తదితరులు ఆమెను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి– గంట్యాడ

వైద్య తనిఖీలు చేస్తున్న డాక్టర్లు హేమలత, అఖిల్

ప్రతి ఒక్కరూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచి అందరూ పరిశుభ్రంగా ఉన్నప్పుడే చర్మ, ఇతర రోగాలు నివారణ అవుతాయని గంట్యాడ పిహెచ్సి వైద్యులు డాక్టర్ హేమలత అన్నారు. మంగళవారం చంద్రంపేట గ్రామంలో నేచర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. చర్మ సంబంధ రోగాలు, భారీ నొప్పులు ఇతర రోగాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ పి. అఖిల్తో పాటు ఆమె 160 మందికి వైద్య పరీక్షలను చేసి ఉచిత మందులను అందించారు. ప్రతి రోజూ స్నానం చేసి ఉతికిన బట్లను ధరించి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామంలో మురుగు లేకుండా చూసుకోవాలన్నారు. రాగివలస, కిట్టిభర్తీ, పెన్నాం, చిన్న మానాపురం గ్రామాలకు సంబంధించిన ప్రజలు ఈ వైద్యశిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో ఎస్బిఐ ఫౌండేషన్ టీమ్ ఎన్.ప్రసాద్, ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ పి. అఖిల్, ఫార్మాసిస్టు భవానీ, స్టాఫ్ నర్స్ జ్యోతి, ల్యాబ్టెక్నీషియన్ బానుప్రకాష్, వాహన నిర్వాహుకులు రవ్వ రాము పాల్గొన్నారు.

ఇఎస్ఐలో ఉచిత మెగా వైద్య శిబిరం

గరివిడి : ప్రధాని మోడీ ప్రవేశ పెట్టిన స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అబియాన్లో భాగంగా ఇఎస్ఐ ఆసుపత్రిలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్ విశాఖపట్నం వారి సౌజన్యంతో డాక్టర్ మురళి మేనేజింగ్ డైరెక్టర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ హారిక, డాక్టర్ జి. శ్రీధర్, డాక్టర్ పాల, ఫార్మసిస్ట్ బి. రవికుమార్ పాల్గొని 70 మందికి తనిఖీ చేశారు. అవసరమైన వారికి ఉచిత మందులు పంపిణీ చేశారు.

నేరాలు ఘోరాలు

కారు ఢీ కొని మహిళ మృతి

ప్రజాశక్తి – రామభద్రపురం

భూసాయ వలస జాతీయ రహదారి వద్ద కారు ఢీకొన్న ఘటనలో మహిళ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కొండకెంగువ గ్రామానికి చెందిన ఆర్. అప్పలమ్మ (65) మెంటాడ కుమార్తె ఇంటికి వెళ్ళి తిరిగి మామిడివలస బంధువుల ఇంటికి వెళ్లేందుకు వస్తూ బస్సు దిగి వెళుతుండగా వెనుక నుంచి అజాగ్రత్తగా కారు నడుపుతూ అతివేగంగా వస్తూ ఈమెను ఢీ కొట్టారు. తీవ్ర గాయాలపాలైన ఆమెను ఎన్ఆర్ఐ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మరణించినట్లు తెలిపారు. ఈమె మనువడు ఈశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఆరికతోటకు చెందిన కారు డ్రైవర్ సున్నపు వరరాజు ప్రసాద్ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి– శృంగవరపుకోట

మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన గోకాడ ప్రదీప్ (29) ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని సిఐ వి. నారాయణమూర్తి మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు ప్రదీప్ హైదరాబాద్లో ఒక ప్రైవేట్ కంపెనీలో నెట్వర్క్ డిజైన్ పని చేస్తూ సెప్టెంబర్ 28న గ్రామానికి వచ్చాడు. సరైన ఉద్యోగం లేకపోవడం వల్ల మనస్తాపం చెంది 29న రాత్రి ఇంటిలో మేడపైన గదిలో చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి బాపునాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మనస్తాపంతో నిరుద్యోగి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి – రామభద్రపురం

మండల కేంద్రంలో కనిమేరక వీధికి చెందిన కనిమెరక సాయివిశ్వనాద్ (25) పురుగు మందు సేవించి ఆత్మహత్యా యత్నం చేశారు. గత కొన్నేళ్లుగా ఉద్యోగ ప్రయత్నాలు ఏవీ అనుకూలించ కపోవడం ఎంబిఎలో ఉత్తమ పలితం సాధించినా నిరుద్యోగం వెంటాడడంతో జీవితంపై విరక్తి చెంది, మనస్తాపానికి గురై పురుగుల మందు తాగడంతో పాటు బ్లేడుతో చేయి మణికట్టు, మెడ దగ్గర కోసుకొని ఆత్మహత్యాయత్నం చేసాడు. తీవ్ర రక్త స్రావంతో ఉన్న అతనిని కుటుంబ సభ్యులు గమనించి బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడ ప్రాథమిక చికిత్స తరువాత వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఇంకా దీనిపై కేసు నమోదు కాలేదు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయివిశ్వనాథ్

ఆర్టిసి బస్సు ఢీకొని చిన్నారి మృతి

ప్రజాశక్తి– రాజాం

ఆర్టిసి బస్సు ఢీకొని ఏడేళ్ల చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం రాజాం ప్రధాన రహదారి బొబ్బిలి జంక్షన్ సమీపంలో చోటుచేసుకుంది. రేగిడి మండలం బురాడ గ్రామానికి చెందిన మోహన్రావు తన భార్య కుమార్తెతో కలిసి బొద్దాం నుండి బురాడ బైక్పై వెళుతున్నాడు. అదే సమయంలో బొబ్బిలి నుండి శ్రీకాకుళం వెళ్తున్న ఆర్టిసి బస్సు ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిన్నారి ద్రాక్షాయని అక్కడికక్కడే మృతి చెందగా తల్లిదండ్రులకు గాయాలయ్యాయి. సమీపంలో ఉన్న ఆసుపత్రికి తీసుకువెళ్తే బతుకుతుందంటూ తన

తల్లిదండ్రులకు గాయాలు

కుమార్తెను మోహన్రావు భుజాన వేసుకొని తీసుకు వెళ్తున్న దృశ్యంతో అక్కడ స్థానికులు చలించిపోయారు. చిన్నారి స్వగ్రామమైన బురాడ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిస్వార్థ సమాజసేవతో పేరు ప్రఖ్యాతలు

ప్రజాశక్తి–విజయనగరం కోట

నిస్వార్థమైన సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణతోనే స్వచ్ఛంద సంస్థలకు పేరు ప్రఖ్యాతులు లభిస్తాయని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ కల్యాణ చక్రవర్తి పేర్కొన్నారు. మంగళవారం ఎస్విఎన్ హోటల్లో రోటరీ సెంట్రల్ క్లబ్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని కళ్యాణ చక్రవర్తి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల ద్వారా యువత విస్తృతంగా రక్తదాన శిబిరాలు నిర్వహించడం వల్లే ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారు సైతం బతికి జీవించగలుగుతున్నారని పేర్కొన్నారు. రక్తదాతల మేలు మరువలేనిదని, రక్త దానం చేస్తే ప్రాణ దానం చేసినట్లేనని పేర్కొన్నారు. యువత అవగాహనతో రక్తదాన శిబిరాల నిర్వహణకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

99.9 శాతం పోలియో నిర్మూలన జరిగడంలో రోటరీ క్లబ్ లు ప్రధాన పాత్ర పోషించాయని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు విజయ్ కుమార్ అగర్వాల్, కార్యదర్శి ఉదయ్ కుమార్, ప్రతినిధులు ఆర్.శంకర్ రెడ్డి, టి.ఎల్.ఎన్.మూర్తి, కాపుగంటి ప్రకాష్, కష్ణ తేజ, చెన్నా ప్రదీప్, రోహిత్ సంజయ్, జయకష్ణ, రాజేష్ , తదితరులు పాల్గొన్నారు.

4న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి– రేగిడి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అక్టోబర్ 4న మధ్యాహ్నం 2గంటలకు ఎంపిపి ధార అప్పలనరసమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ శ్యామల కుమారి మంగళవారం తెలిపారు. ఈ మండల సమావేశానికి ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ రానున్నట్లు తెలిపారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయా శాఖాధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని తెలిపారు. సభ్యులు కాని వారు మండల సర్వసభ్య సమావేశానికి రావద్దని కోరారు.

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS AT VIZIANAGARAM
ARBITRATION CLAIM PETITION NO.32/2025

BETWEEN:
M/S Shriram Chits (India) Pvt Ltd, Vizianagaram Branch-2, Rep by its Junior Manager. **.... DISPUTANT**
VERSUS
SUBSCRIBER
Giddi David Raju & others
GUARANTOR
OP2) Gotivada Sri Devi, W/o David Raju, Hindu, aged about 44 years, working as Hostel Welfare Officer, Govt BC Girls Hostel, Kothavalasa, Vizianagaram (dist)
. . . OPPONENT

NOTICE

పై నెంబరు దావా మీ నుండి దావా సొమ్ము మరియు ఖర్చులు రాబట్టుకొనే నిమిత్తం పై ఆర్బిట్రేటర్ వద్ద వాది దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్నచో తే 08-10-2025 ది ఉ॥ గం॥ 10.30 గం॥లకు పై కోర్టులో మీరు స్వయంగా గాని లేదా లాయరు ద్వారా గాని హాజరై మీ వాదన తెలియజేసుకోవలెను. లేని యెడల ఆర్బిట్రేటర్ వారు పైదావా మీ పరోక్షమున తీర్మానించడ మగునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

డివిజినల్ మేనేజర్
శ్రీరామ్చిట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, విజయనగరం

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS AT VIZIANAGARAM
ARBITRATION CLAIM PETITION NO.34/2025

BETWEEN:
M/S Shriram Chits (India) Pvt Ltd, Vizianagaram Branch-2, Rep by its Junior Manager. **.... DISPUTANT**
VERSUS
SUBSCRIBER
Katta Siva Prasad & others
GUARANTORs
OP1) Katta Siva Prasad, S/o Eswara Rao, H.No. 1-63, Punyagiri Road, Nr: Railway Gate, S.Kota, Vizianagaram (dist),
OP3) Bheempalli Ram Babu, S/o Simhadri, working as Police Constable-1882, Skota, Vizianagaram (dist),
. . . OPPONENT

NOTICE

పై నెంబరు దావా మీ నుండి దావా సొమ్ము మరియు ఖర్చులు రాబట్టుకొనే నిమిత్తం పై ఆర్బిట్రేటర్ వద్ద వాది దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్నచో తే 08-10-2025 ది ఉ॥ గం॥ 10.30 గం॥లకు పై కోర్టులో మీరు స్వయంగా గాని లేదా లాయరు ద్వారా గాని హాజరై మీ వాదన తెలియజేసుకోవలెను. లేని యెడల ఆర్బిట్రేటర్ వారు పైదావా మీ పరోక్షమున తీర్మానించడ మగునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

డివిజినల్ మేనేజర్
శ్రీరామ్చిట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, విజయనగరం

BEFORE THE HONOURABLE COURT OF DISTRICT CONSUMER REDRESSAL COMMISSION AT VIZIANAGARAM
C.C. No. 19 /2025

Between:
Sri Komma Suryarao S/o late Satyanarayana of aged years, Hindu, cultivation, Nelivada Village, Bondapalli Mandalam Vizianagaram District. Andhra Pradesh State (Adhaar No 2290 2715 4764) PAN No. : . BODPK1302R....Complainant,
AND :
1. Sahara Credit co-operative credit co-operative society limited, Registered office at Sahara India Bhavan 1,Kapurtala Complex, Alaganz, Luknow, 226024 represeted by its Managing Director.
2. BRANCH MANAGER., SAHARA INDIA LIMITED, 1 floor,Sweet India Building Railway Station Road, Vizianagaram -535003.....ప్రతివాదులు

సమన్ నోటీసు

పై నెంబరు Consumer case No. 19 నందు ప్రతివాదులు అయిన మీరు CONSUMER REDRESSAL COMMISSION వారు Indian postal service పోస్ట్ ద్వార మరియు కొరియర్ ద్వార పంపిన కేసు సమన్ – నోటిసులు అందుకోనందున CONSUMER REDRESSAL COMMISSION వారి అనుమతి ప్రాకారము ఇందుల వారి తరపున ఈ డైలీ న్యూస్ పేపర్ ద్వార పైన ఉదాహరించిన ప్రతివాదులైన మీకు సమన్ – నోటీసులు జారీ చేయునది విషయము ఏమనగా పై నెంబర్ కేసు తేది 3-10-2025 CONSUMER REDRESSAL COMMISSION విజయనగరం నందు విచారణ నిమిత్తం ఉన్నది, కావున ఇందుల ప్రతివాదులైన మీరు స్వయముగా గాని మరియు మీ అడ్వకేట్ ద్వారా **తేది 3-10-2025 ఉదయం గం 10-00** విచారణకు హాజరు కాగలరు.

శ్రీ పంతులు జానకి రామ జోగారావు
వాది తరపు అడ్వకేట్
విజయనగరం
విజయనగరం
తేది 30-09-2025
సెల్ 9440754396

BEFORE THE HONOURABLE COURT OF DISTRICT CONSUMER REDRESSAL COMMISSION AT VIZIANAGARAM
C.C. No. 18 /2025

Between:-
Sri Komma Suryarao S/o late Satyanarayana of aged years, Hindu, cultivation, Nelivada Village, Bondapalli Mandalam Vizianagaram District. Andhra Pradesh State. (Adhaar No 2290 2715 4764) PAN No: "BODPK1302R"
....Complainant/వాది
AND:
1. STARS MULTIPURPOSE COOPERATIVE SOCIETY LIMITED, represented by its Chief Promoter 613, Vayu Block, My Home, Navadweepa, Hi-tech City, Madhapur Hyderabad - 500081 T.S.State
2. The Chief Executive Officer/ Managing Director, STARS MULTIPURPOSE COOPERATIVE SOCIETY LIMITED, 3d floor,Door No. 5-9-15. Opposite T.S Secretariat, Saifabad, HYDERABAD, Pin:500063
3. BRANCH MANAGER., SAHARA INDIA LIMITED, 1st floor, Sweet India Building Railway Station Road, Vizianagaram-535003
.........ప్రతివాదులు

సమన్ నోటీసు

పై నెంబరు Consumer case No. 18 నందు ప్రతివాదులు అయిన మీరు CONSUMER REDRESSAL COMMISSION వారు Indian postal service పోస్ట్ ద్వార మరియు కొరియర్ ద్వార పంపిన కేసు సమన్ – నోటిసులు అందుకోనందున CONSUMER REDRESSAL COMMISSION వారి అనుమతి ప్రాకారము ఇందుల వారి తరపున ఈ డైలీ న్యూస్ పేపర్ ద్వార పైన ఉదాహరించిన ప్రతివాదులైన మీకు సమన్ – నోటీసులు జారీ చేయునది విషయము ఏమనగా పై నెంబర్ కేసు తేది 3-10-2025 CONSUMER REDRESSAL COMMISSION విజయనగరం నందు విచారణ నిమిత్తం ఉన్నది, కావున ఇందుల ప్రతివాదులైన మీరు స్వయముగా గాని మరియు మీ అడ్వకేట్ ద్వారా **తేది 3-10-2025 ఉదయం గం 10-00** విచారణకు హాజరు కాగలరు.

శ్రీ పంతులు జానకి రామ జోగారావు
వాది తరపు అడ్వకేట్
విజయనగరం
విజయనగరం
తేది 30-09-2025
సెల్ 9440754396